షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 333 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 18 జనవరి 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 333 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 21 October 2024 PAGES : 8 PRICE : 5/-

# స్కిల్ వర్శిటీతో బోణి

- రేవంత్ సింగపూర్ పర్యటన..
- తొలిరోజే కీలక ఒప్పందం
- స్కిల్ యూనివర్సిటీ వీసీ, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ మధ్య ఒప్పందం
- హైదరాబాదులోని ఫోర్త్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.



హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ముఖ్యమంత్రి తొలిరోజు పర్యటనలోనే కీలక ఒప్పందం జరిగింది. సింగపూర్ ఐటీఈ ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌తో తెలంగాణలో ఎంగ్ ఇండియా యూనివర్సిటీ ఒప్పందం చేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఐటీఈ పాఠ్యాంశాలను స్కిల్ వర్శిటీ ఉపయోగించుకోనుంది. ఈ మేరకు స్కిల్ యూనివర్సిటీ వీసీ, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ మధ్య ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి సింగపూర్ పర్యటనలో తొలిరోజు విశేష స్పందన లభించింది. పర్యటనలో భాగంగా సింగపూర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) క్యాంపస్‌ను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, అధునాతన సదుపాయాలను పరిశీలించారు. అక్కడ శిక్షణను అందిస్తున్న దాదాపు 20 రంగాలకు చెందిన నిపుణులు, కాలేజీ సిబ్బందిని కలిసి మాట్లాడారు. అనంతరం ఐటీఈ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. హైదరాబాదులోని ఫోర్త్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వివిధ కోర్సులు నిర్వహిస్తున్న తీరును - మిగతా3లో



## 37 రోజులు కాదు.. దమ్ముంటే 370 రోజులు జైల్లో పెట్టుకో

- సీఎం రేవంత్‌కు తేల్చిచెప్పిన కేటీఆర్
- 100 శాతం రుణమాఫీ అయిందని రాసిస్తే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలం రాజీనామా చేస్తాం
- ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకో. నిలబెట్టుకోకపోతే వెంటాడుతాం.. అడుగూతనే ఉంటాం
- రైతులను రుణమాఫీ పేరిట మోసం చేసిండు.
- సిలిండర్ ఫ్రీగా వస్తలేదు. కరెంట్ 200 యూనిట్ల ఫ్రీగా ఇవ్వడం లేదు
- పచ్చి మోసగాడు.. పచ్చి అబద్దాల కోరు సీఎం రేవంత్..
- 420 కేసు పెట్టాలంటే రేవంత్ రెడ్డి మీద చీటింగ్ కేసు పెట్టాలి.



## 31 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు


- ఈ నెల 31 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు
- ఈసారి రెండు విడతలుగా పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు
- జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత సమావేశాలు
- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్
- మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు

## రష్యా తరుపున యుద్ధంలో పోరాడి 12 మంది భారతీయులు మృతి

- రష్యా తరపున యుద్ధం చేస్తున్న 16 మంది భారతీయులు మిస్సింగ్
- ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో రష్యా తరపున పోరాడుతున్న భారతీయులు
- ఇప్పటివరకు 12 మంది మృతి
- రష్యా సైన్యం నుంచి బయటకు వచ్చిన 96 మంది



## మహిళా సాధికారికత లక్ష్యంగా



- మహిళలకు రూ.2,500 సాయం, గ్యాస్ బండపై రూ.500 సబ్సిడీ
- నగర వాసుల జీవన ప్రమాణాలు మెరుగుపరచేందుకు కొత్తగా చర్యలు
- బడుగు వర్గాలతో సహా సమాజంలోని అన్నివర్గాలను సంక్షేమానికి పార్టీ కృషి

## ఆయుష్మాన్ భారత్ అతిపెద్ద స్కామ్

- ఇది నకిలీ స్కామ్ అని సుప్రీంకోర్టు ధృవీకరించడం తనకు సంతోషంగా ఉంది
- ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేయడంలేదు
- ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్



## గాజుల రామారంలో అక్రమంగా భారీ అక్రమ షెడ్డు నిర్మాణం

అధికారుల చర్యలు శూన్యం ..!

గాజులరామారం ఎల్ ఎన్ బార్-రెస్టారెంట్ ఎదురుగా భారీ షెడ్డు నిర్మాణం..!

గాజులరామారం సర్కిల్ లో టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నట్టా లేనట్టా..!

అక్రమ షెడ్లకు పూర్తిగా సహకరిస్తున్న , టౌన్ ప్లానింగ్ అధికారులు..?

ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి....!

నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు...!





**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి జనవరి 17** గాజులరామారం సర్కిల్ పరిధిలో అక్రమ షెడ్ల పరంపర కొనసాగుతుంది. ప్రతి రోజు ఏదో ఒక పత్రికలో అక్రమ నిర్మాణాల గురించి వస్తూనే ఉంది. కానీ ఆ వార్తలను టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోకుండా అక్రమంగా షెడ్లు నిర్మాణ దారులకు పూర్తి సహకరిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణ వినిపిస్తున్నాయి. గాజులరామారం ఎల్ ఎన్ బార్%ఁ%రెస్టారెంట్ ఎదురుగా సర్వే నెంబర్ 464లో అక్రమ భారీ షెడ్ నిర్మాణం జరుపుతున్నా... అధికారులు మాత్రం అంతా తెలిసిన చూసి చూడనట్టు వ్యవహరించడం పై సర్వత్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే అక్రమ షెడ్ పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గాజులరామారం సర్కిల్ లో రాజ్యమేలుతున్న అధికారుల అవినీతి ఇక్కడ లంచాల కే శరణ్యం అంటూ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇలా అవినీతి సిబ్బంది అందిన కాడికి దండుకుంటున్నారని దానికి తోడు న్యాక్ ఇంజనీర్లు సైతం జిహెచ్ఎంసి నియమ నిబంధనలను తుంగలో తొక్కి ధనార్జనే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్నారని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అక్రమాలకు పాల్పడుతుంటే ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన డిప్యూటీ కమిషనర్, సెక్షన్ ఆఫీసర్ వాళ్లతో చేతులు కలిపి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా గాజులరామారం టౌన్ ప్లానింగ్ విభాగం అక్రమ షెడ్లు, అక్రమ భవనాలు నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. లంచాలు ఇస్తే ఇక్కడ ఎలాంటి అక్రమ షెడ్ అయిన భవనమైన నిర్మించుకోవచ్చని దీనిపై విజిలెన్స్ విచారణ చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## కుల సర్వే ఆధారంగా కొత్త రేషన్ కార్డులు



- 26 నుంచి కొత్త రేషన్ కార్డులు
- కొత్త రేషన్ కార్డులపై ప్రభుత్వం కీలక నిర్ణయం
- తెలంగాణలో 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి
- ప్రజా పాలనపై ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేస్తున్నాయి
- పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు

కరీంనగర్

జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. తెలంగాణలో 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. ప్రజా పాలనపై ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని స్పష్టం చేశారు. కుల సర్వే ఆధారంగా కొత్త రేషన్ కార్డులు ఇస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ - మిగతా3లో

## మహా కుంభమేళా వెళ్లే భక్తులకు సూపర్ ఆఫర్..

# ఐఆర్‌సీటీసీ సరికొత్త టూర్

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ప్రయాగ్ రాజ్‌లో మహా కుంభమేళా అత్యంత వైభవంగా జరుగుతోంది. దేశవిదేశాల నుంచి కోట్లాదిమంది భక్తులు ఇక్కడ పుణ్య స్నానం చేయడానికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. దాదాపు 40 కోట్ల మందికిపైగా ఈ మహా కుంభమేళాకు వస్తారని అధికారుల అంచనా. జనవరి 14న ప్రారంభమైన మహా కుంభమేళా మొత్తం 45 రోజుల పాటు జరుగనుంది. ఈ నేపథ్యంలోనే ప్రయాణీకుల కోసం ఐఆర్‌సీటీసీ స్పెషల్ టూర్ ప్యాకేజీని తీసుకొచ్చింది.

**దానాపూర్ ఎక్స్‌ప్రెస్..**

తెలుగు రాష్ట్రాల నుంచి ఈ మహా కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం దానాపూర్ ఎక్స్‌ప్రెస్ జర్నీతో సరి కొత్త ప్యాకేజీని ప్రకటించింది. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ ప్రయాణీకుల కోసం ఎప్పటికప్పుడు స్పెషల్ టూర్ ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొస్తోన్న సంగతి తెలిసిందే. ప్రయాణికుల అభిరుచులకు తగ్గట్టు అతి తక్కువ ఖర్చుతో ప్రత్యేక టూర్స్ ఆఫర్ చేస్తోంది. ఈ క్రమంలోనే మహా కుంభమేళా టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చింది.

**తెలుగు రాష్ట్రాల్లో..**

మొత్తం 6 రోజులపాటు అంటే 5 రాత్రులు, 6 పగళ్ల పాటు ఈ ప్యాకేజీ ఉంటుంది. 3 రోజుల పాటు ఉదయం టిఫిన్, రాత్రిపూట భోజనం ఉంటుంది. అంతేకాకుండా ట్రావెల్ ఇన్సూరెన్స్ కూడా ఉంటుంది. ఈ ట్రైన్? జర్నీ హైదరాబాద్ నుంచి ప్రారంభమవుతుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమంత్రి, ఏలురు, తుని, దువ్వాడ, విజయనగరం రైల్వే స్టేషన్లలో మహా కుంభమేళకు వెళ్లాలనుకునే భక్తులు ఈ ట్రైన్? ఎక్కొచ్చు. ఈ టూర్‌లో భాగంగా భక్తులు వారణాసి కూడా కవర్ చేయవచ్చు.ఈ నెల 17, 19, 24 తేదీల్లో అదేవిధంగా వచ్చే నెల ఫిబ్రవరిలో 2, 7, 14, 16, 21 తేదీల్లో ఈ ఆధ్యాత్మిక యాత్ర టూర్ ప్రారంభం కానుంది.



**టికెట్ ధరలు ఇలా ఉన్నాయి:**

థర్డ్ ఏసీలో సింగిల్ షేరింగ్ - రూ. 48,730
డబుల్ షేరింగ్ - రూ. 31,610
ట్రిపుల్ షేరింగ్ - రూ. 29,390
5-11 ఏళ్ల చిన్నారుల కోసం..
(విత్ బెడ్) - రూ. 22,890
వితౌట్ బెడ్ - రూ. 14,650
స్లీపర్ క్లాస్‌లో సింగిల్ షేరింగ్ - రూ. 45,700
డబుల్ షేరింగ్ - రూ. 28,570
ట్రిపుల్ షేరింగ్ రూ. 26,360
5-11 ఏళ్ల చిన్నారులు:
విత్ బెడ్ రూ. 19,860
వితౌట్ బెడ్ - రూ. 11,620

## రష్యా తరుపున యుద్ధంలో పోరాడి 12 మంది భారతీయులు మృతి

**న్యూఢిల్లీ:** ఉక్రెయిన్ తో జరుగుతున్న యుద్ధంలో రష్యా తరపున పోరాడుతున్న 16 మంది భారతీయులు కనిపించకుండా పోయినట్టు విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఉక్రెయిన్ తో జరుగుతున్న యుద్ధంలో 126 మంది భారతీయులు పాల్గొన్నట్టు సమాచారం ఉందని తెలిపారు. వీరిలో 96 మంది సైన్యం నుంచి బయటకు వచ్చారని చెప్పారు. వీరిలో కొందరు స్వదేశానికి తిరిగొచ్చారని వెల్లడించారు. ఇప్పటి వరకు యుద్ధంలో పోరాడుతూ 12 మంది మరణించారని తెలిపారు. అక్కడే ఉండిపోయిన వారిని త్వరగా స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరుపున పోరాడిన భారతీయుల్లో 12 మంది మరణించారు. మరో 16 మంది ఆచూకీ తెలియడం లేదు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని నిర్ధారించింది. యుద్ధంలో మరణించిన భారతీయుల మృతదేహాలను, గాయపడిన వారిని దేశానికి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించింది. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా తరుపున ఫైట్ చేసిన కేరళకు చెందిన బినిల్ బాబు మరణించాడు. గాయపడిన మరో భారతీయుడు జైన్ టికె, మాస్కోలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నాడు. కాగా, తాజా మరణాల నేపథ్యంలో ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరుపున పోరాడుతున్న భారతీయులపై విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు 126 మంది భారత పౌరులు రష్యా సైన్యంలో పని చేశారని తెలిపారు. 96 మందిని రష్యా ఆర్మీ నుంచి డిశ్చార్జ్ చేయడంతో వారు దేశానికి తిరిగివచ్చినట్లు చెప్పారు. మరోవైపు రష్యా సైన్యంలో చేరిన వారిలో 12 మంది భారతీయ పౌరులు మరణించారని రణధీర్ జైస్వాల్ తెలిపారు. ప్రస్తుతం రష్యా ఆర్మీలో 18 మంది భారతీయులు మిగిలి ఉన్నట్లు చెప్పారు. అయితే వీరిలో 16 మంది ఆచూకీ తెలియడం లేదని అన్నారు. వారు తప్పిపోయినట్లుగా రష్యా పేర్కొన్నదని వివరించారు. మిగిలిన భారతీయులను రష్యా ఆర్మీ నుంచి డిశ్చార్జ్ చేసి త్వరగా స్వదేశానికి పంపాలని ఆ దేశాన్ని భారత్ కోరిందన్నారు.

## ఆయుష్మాన్ భారత్ అతిపెద్ద స్కామ్




**న్యూఢిల్లీ:** ఆయుష్మాన్ భారత్ అతిపెద్ద స్కామ్ అని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఇది నకిలీ స్కామ్ అని సుప్రీంకోర్టు ధృవీకరించడం తనకు సంతోషంగా ఉందని చెప్పారు. కేంద్రంలో ప్రభుత్వం మారి దర్యాప్తు చేపడితే ఆయుష్మాన్ భారత్ పథకంలో జరిగిన భారీ అవినీతి గురించి ప్రజలకు తెలుస్తుందని అన్నారు. కాగా, ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేయడంలేదు. ఈ నేపథ్యంలో పీఎం ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎం-అభీమ్)ను ఢిల్లీలో అమలు చేయడానికి జనవరి 5 లోగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ)పై సంతకం చేయాలని డిసెంబర్ 24న ఆప్ ప్రభుత్వాన్ని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. మరోవైపు ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేసింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఆయుష్మాన్ భారత్ అమలు కోసం ఒప్పందం చేసుకోవాలన్న ఢిల్లీ హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది. కేంద్రం, ఇతరుల స్పందన కోరుతూ నోటీసులు జారీ చేసింది.

## ఆసుపత్రి రూఫ్‌టాప్‌పై హెలిప్యాడ్.. ఈ తరహాలో ఇదే మొదటిది



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి అరుదైన ఘనత సాధించింది. ఆసుపత్రి రూఫ్‌టాప్‌పై హెలిప్యాడ్‌ను నిర్మించి విజయవంతంగా ట్రయిల్ రన్ నిర్వహించింది. బెహలా ఫ్లైయింగ్ క్లబ్ నుంచి బయలు దేరిన అగస్టా 109 ఎస్‌పీ హెలికాప్టర్ శుక్రవారంనాడు ఆసుపత్రి రూఫ్‌టాప్‌పై సక్సెస్‌ఫుల్‌గా ల్యాండ్ అయింది. ఎమర్జెన్సీ హెల్త్‌కేర్ సేవల్లో ఇదొక కీలకమైన మైలురాయి అని ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ దేసున్ హాస్పిటల్ ప్రకటించింది. ఎమర్జెన్సీ హెల్త్‌కేర్ సేవల కోసం దేసున్ హాస్పిటల్ రూఫ్‌టాఫ్ హెలిప్యాడ్ సేవలకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ జనవరి 14న అనుమతి ఇచ్చింది. తొలి ట్రయిల్ రన్ నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. శుక్రవారంనాడు నిర్వహించిన ట్రయిల్ రన్ విజయవంతం కావడంపై దేసున్ ఆసుపత్రి చైర్మన్ అండ్ మేనేజింగ్ డెరెక్టర్ సాజల్ దత్తా సంతోషం వ్యక్తం చేశారు. "ఇది మా అందరికీ గర్వకారణం. తీవ్ర ప్రాణాపాయంలో చిక్కుకున్న పేషెంట్లకు ఎమర్జెన్సీ సేవలు అందించేందుకు ఈ హెలిఫ్యాడ్ ఎంతో ఉపయోగపడుతుంది. పశ్చిమబెంగాల్‌కు మాత్రమే కాకుండా ఈశాన్య, తూర్పు భారతదేశంలోని వారందిరికీ ఈ అత్యవసర సేవలు అందుబాటులోకి తెస్తా" అని సాజల్ దత్తా తెలిపారు.

## కంగనా 'ఎమర్జెన్సీ'కి వ్యతిరేకంగా పంజాబ్‌లో నిరసన




**చండీఘడ్:** సినీ నటి కంగనా రనౌత్ నటించిన ఎమర్జెన్సీ చిత్రం ఇవాళ రిలీజ్ అవుతున్నది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవితకథ ఆధారంగా ఈ చిత్రాన్ని తీశారు. అయితే ఆ ఫిల్మ్ రిలీజ్‌ను వ్యతిరేకిస్తూ ఇవాళ పంజాబ్‌లో సిక్కులు ఆందోళనకు దిగారు. అమృత్‌సర్‌లోని ఓ సినిమా హాల్ వద్ద భారీ సంఖ్యలో ఎస్‌జీపీసీ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఎమర్జెన్సీ చిత్రంపై బ్యాన్ విధించాలని ఎస్జీపీసీ పంజాబ్ సర్కార్‌ను కోరింది.పంజాబ్‌లోని అన్ని సినిమా హాళ్లలో షోలను రద్దు చేయాలని కోరింది. కాంగ్రెస్ ఎంపీ, పంజాబ్ చీఫ్ అమరిందర్ సింగ్ రాజా.. మాట్లాడుతూ.. ఇలాంటి సినిమాలు తీసినప్పుడు, ఆ చిత్రాల్లో వాస్తవాలను వక్రీకరిస్తారని పేర్కొన్నారు. మసాలా లేకుండా సినిమా సక్సెస్ కాదన్నారు. ప్రజల్ని ఎంటర్‌టైన్ చేసేందుకు ఇలాంటి సినిమాలు తీయడం సరికాదన్నారు. ప్రభుత్వాలు, సెన్సార్ బోర్డులు .. ఇలాంటి చిత్రాలపై నిఘా పెట్టాలన్నారు. చిత్రంలో చూపించింది నిజం కాదు అని, అది కేవలం ఓ స్క్రిప్టు మాత్రమే అని ఆయన పేర్కొన్నారు.

## 255 మంది అధికారులకు నోటీసులు.. విషయం ఏంటంటే..

**బళ్లారి(బెంగళూరు):** ప్రభుత్వ అధికారుల పనితీరుపై జిల్లాలో 95 ఫిర్యాదులు నమోదు కాగా, వాటిని ఈ నెల 18వ తేదీన ఉప లోకాయుక్త అధికారి జస్టిస్ బి.వీరప్ప విచారించనున్నారు. వివిధ శాఖలకు చెందిన 255 మందిపై అధికారులు 95మంది లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. వీరందరికి జిల్లా లోకాయుక్త ఎస్పీ ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఈ నెల 18వ తేదీన జరగనున్న ఉప లోకాయుక్త విచారణలో నోటీసులు అందుకున్న అధికారులు, ఆయా శాఖల ప్రధాన అధికారులు విచారణ కు హాజరు కావాల్సి ఉందని నోటీసులో సూచించారు. అన్ని కేసులు విచారణ జరపనున్న ఉప లోకాయుక్త అధికారి అదేరోజు ఆదేశాలు జారీ పిర్యాదులు పరిష్కరించ నున్నట్లు సమాచారం. చాలా వరకు కేసులు ఇప్పటికే విచారణ జరిగాయి. ఇంకా కొన్నికేసులు విచారణ చేయాల్సి ఉంది. ఉప లోకాయుక్త అధికారి బళ్ళారి పర్యటన నేపథ్యంలో జిల్లా పాలనామండలికి చురుకు ముట్టినట్లు అయింది. లోకాయుక్త అధికారులు ఏ ప్రభుత్వ కార్యాలయానికి ఎపుడు వస్తారోనని అధికారుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. దీంతో రాత్రిపగలు తేడాలే కుండా ఆఫీసుల్లో ఫైళ్ళు సర్దేపనిలో నిమగ్నమయ్యారు.


జిల్లాధికారి ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి కార్యాలయాల్లో ఎలాంటి దోషాలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో క్రింది స్థాయి ఉద్యోగులు, సిబ్బందికి కార్యాలయం ముఖ్యస్తులు విశ్రాంతి లేకుండా పనులు చేయిస్తున్నారు. గురువారం




ఉపలోకాయుక్త అధికారి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తెల్లవారు జామున బళ్ళారి ఏపీఎంసీ, జిల్లా ఆసుపత్రి, తాసీల్దారు కార్యాలయం, బళ్ళారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాల(బిమ్స్)లో రోగులకు అందుతున్న వైద్యసేవలు గురించి పర్యవేక్షించడం గమనార్హం. జిల్లాస్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు అవినీతికి సంబంధించి 30 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు, ఇందులో 15ఏళ్ళ క్రితం నమోదైన కేసులు ఉన్నట్లు తెలిసింది. కొన్నికేసులకు సంబంధించి చార్జ్‌షీట్ వేసేందుకు సంబంధిత అధికారుల నుండి అనుమతి కోరినట్లు తెలిసింది. కొన్ని అభ్యర్థులు తిరస్కరించగా, కొన్ని అభ్యర్థులు మంజూరు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో ఒక ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో ఈ వాస్తవాలు వెలుగుచూశాయి కేసుల స్వరూపం భిన్నంగా ఉండడంతో 18న విచారణ జరగనుందని అధికారుల సమాచారం.

## బార్‌లో అసభ్యకర ప్రవర్తన.. 40 మందిపై కేసు నమోదు


**థానే:** మహారాష్ట్రలోని థానే జిల్లాలోని ఓ బార్‌లో అసభ్యకర ప్రవర్తన కింద 40 మందిపై కేసు నమోదు చేశారు. దీంట్లో 8 మంది మహిళా సర్వర్లు, మరికొంత మంది కస్టర్లు కూడా ఉన్నారు. బార్‌లో ఆ వ్యక్తులు అభ్యంతరకరంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కళ్యాణ్-షిల్ రోడ్డు మార్గంలో ఉన్న బార్‌లో అర్ధరాత్రి అధికారులు తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో బార్‌లో అసభ్యకర సంఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. జనవరి 14వ తేదీ రాత్రి ఈ ఘటన జరిగింది. డోంబివాలిలోని మన్‌పాడా పోలీసులు.. బార్‌తో లింకున్న 23 మంది పురుషులపై కేసు బుక్ చేశారు. 8 మంది మహిళా సర్వర్లు, 8 మంది కస్టమర్లపై కూడా ఆ కేసు నమోదు చేశారు. కేసుతో లింకున్న ఎవర్నీ అరెస్టు చేయలేదు.



## సైఫ్ అలీ ఖాన్ కేసు.. పోలీసుల మరో ట్విస్ట్

ప్రముఖ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై దాడి హాట్ టాపిక్‌గా మారింది. దేశంలోని అన్ని చిత్రపరిశ్రమలను ఉలిక్కిపడేలా చేసిన ఈ కేసులో ఒక్కొక్కటిగా సంచలన విషయాలు బయటపడుతున్నాయి. గంటకో మలుపు తిరుగుతున్న ఈ కేసులో తాజాగా ముంబై పోలీసులు మరో బిగ్ ట్విస్ట్ ఇచ్చారు. వాడు వీడు కాదని.. అసలు నిందితుడు తమ అదుపులో లేడంటూ బాంబు పేల్చారు. ఇప్పటివరకు ఎవర్నీ అరెస్ట్ చేయలేన్నారు. సైఫ్ అలీ ఖాన్ కేసులో నిందితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారంటూ ఉదయం కథనాలు వచ్చాయి. దీనిపై పోలీసులు రియాక్ట్ అయ్యారు. పొద్దున బాంద్రా పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చిన వ్యక్తికి సైఫ్ మీద దాడితో సంబంధం లేదని స్పష్టం చేశారు. నిందితుడి కోసం తీవ్రంగా గాలిస్తున్నామని క్లారిటీ ఇచ్చారు. నిందితుడు తమ అదుపులో ఉన్నాడని వస్తున్న పుకార్లలో నిజం లేదని పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎవర్నీ అదుపులోకి తీసుకోలేదని చెప్పుకొచ్చారు.

## మహిళా సాధికారికత లక్ష్యంగా



న్యూఢిల్లీ: దేశ రాజధాని వాసులకు పలు సంక్షేమ చర్యలకు భరోసా ఇస్తూ భారతీయ జనతా పార్టీ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో 'సంకల్ప్ పత్ర-1'ను శుక్రవారంనాడు ప్రకటించింది. పార్టీ ప్రధాన కార్యాలయంలో ఈ మేనిఫెస్టోను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విడుదల చేశారు. ఓటర్లను ఆకర్షించే ప్రయత్నంలో భాగంగా ఢిల్లీలోని ప్రతి మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని బీజేపీ ప్రకటించింది. మహిళా సాధికారికత లక్ష్యంగా వారికి మరింత ఆర్థిక పరిపుష్టి కల్పిస్తామని హామీ ఇచ్చింది. పెరుగుదుల ధరవరలతో గృహాలపై పడుతున్న భారాన్ని దష్టిలో ఉంచుకుని ఎల్పీజీ సిలెండర్లపై రూ.500 సబ్సిడీ ఇస్తామని వాగ్దానం చేసింది. మేనిఫెస్టో విడుదల అనంతరం జేపీ నడ్డా మీడియాతో మాట్లాడుతూ, నగర వాసుల జీవన ప్రమాణాలు మెరుగుపరచేందుకు కొత్తగా చర్యలు తీసుకుంటూ అమల్లో ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని చెప్పారు. బడుగు వర్గాలతో సహా సమాజంలోని అన్నివర్గాలను సంక్షేమానికి పార్టీ కృషి చేస్తుందన్నారు. 2014లో తాము 500 వాగ్దానాలు చేశామని, 499 వాగ్దానాలను అమలు చేశామని, 2019లో 235 వాగ్దానాల్లో 225 నెరవేర్చామని చెప్పారు. తక్కినవి కూడా వివిధ దశల్లో అమలుకు సిద్ధమవుతున్నాయని నడ్డా చెప్పారు.

**మేనిఫెస్టోలో కీలక వాగ్దానాలు**

-మహిళా సమృద్ధి యోజన కింద రూ.2,500 ఆర్థిక సాయం
-ఢిల్లీలోని పేద మహిళలకు రూ.500 సిలెండర్ సబ్సిడీ
-ప్రతి హెూలి, దిపావళికి ఒక సిలెండర్ ఉచితం
-మహిళలకు 6 న్యూట్రీషనల్ కిట్‌లు, గర్భిణీ స్త్రీలకు రూ.21,000 సాయం
-తొలి మంత్రివర్గ సమావేశంలోనే ఆయుష్మాన్ భారతి యోజనకు నిర్ణయం, అదనంగా రూ.50,00 హెల్త్ కవర్.

## 31 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

**న్యూఢిల్లీ:** పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఖరారయ్యారు. రెండు విడతలుగా జరిగే ఈ సమావేశాల్లో తొలి విడత జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగుతాయి. రెండో విడత సమావేశాలు మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకూ జరుగుతాయి. పార్లమెంటు సమావేశాల షెడ్యూల్ ప్రకారం, ఈనెల 31న పార్లమెంటులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో సమావేశాలు ప్రారంభవుతాయి. ఫిబ్రవరి 1న 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాధారణ బడ్జెట్‌ను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెడతారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఫిబ్రవరి 5న, రవిదాస్ జయంతి నేపథ్యంలో ఫిబ్రవరి 12న పార్లమెంటు కార్యకలాపాలకు సెలవు ఇవ్వాలని నిర్ణయించారు. శుక్రవారం సాయంత్రం అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

## హుజురాబాద్ లో ఎమ్మెల్యే

# కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ గాడిద పై ఊరేగింపు దగ్ధం





కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మకు చీర, పూలు, గాజులు పెట్టి గాడిద పై ఊరేగింపు

కౌశిక్ రెడ్డి రౌడీ రాజకీయాలు మానుకోవాలి

**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ రూరల్ ప్రతినిధి జనవరి 17** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ మంత్రులు ఎమ్మెల్యేలను విమర్శించడాన్ని నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చల్లూరి రాహుల్ ఆధ్వర్యంలో కౌశిక్ రెడ్డి దిష్టి బొమ్మకు పూలు, గాజులు పెట్టి గాడిద పై ఊరేగించి అంబేద్కర్ చౌరస్తా వద్ద దగ్ధం చేశారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ని మంత్రులను దూషించడం మానుకోవాలని తన నోటి దురుసు తో సంచలనాల కొరకు మీడియాలో కనబడాలని తాపత్రయం మానుకోవాలని హెచ్చరించారు. ఇంకోసారి సీఎం, మంత్రుల జోలికి కౌశిక్ రెడ్డి వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. హుజురాబాదులో కౌశిక్ రెడ్డిని అడుగడుగున అడ్డుకొని భౌతిక దాడులకు దిగాల్సి వస్తుందని చల్లూరి రాహుల్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కమిటీ నాయకులు ,కాంగ్రెస్ పార్టీ మండల ,కమిటీలు, కాంగ్రెస్ మహిళ నాయకురాల్లు, పట్టణ శాఖ అధ్యక్షులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


# ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ ను అరెస్ట్ చెయ్యాలి

సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్

**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి జనవరి 17:** సంక్రాంతి రోజు ఆర్ ఎస్ ఎస్ అధినేత మోహన్ భగవత్ దేశ స్వాతంత్ర్యం పై చేసిన వాక్యాలను నిరసిస్తూ నేడు సిపిఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ ఎస్ ఎస్, బీజేపీ నాయకత్వం వారు తరుచుగా రాజ్యాంగంపై, అంబేద్కర్ పై,ఇప్పుడు ఈ దేశ స్వాతంత్ర్యం పై వక్రీకరిస్తూ మాట్లాడటం వారికి ఈ దేశ స్వాతంత్ర్యం పై ఉన్న ద్వేషాన్ని నిరూపిస్తుందని ,గతంలో కూడా జాతీయ పతకాన్ని ఎగురవెయ్యకుండా అవమానించారని ,మళ్ళీ ఇప్పుడు తమ నిజస్వరూపాన్ని బయటపెడుతున్నారని దీని వెనుకాల పైకి హిందూ అనే పదాన్ని ఉపయోగించుకుంటున్నారే తప్ప వారి అసలు ఉద్దేశ్యం మను సిద్ధాంతాన్ని ఈ దేశంలో అమలు చెయ్యడేమేనని అన్నారు. బీజేపీ,ఆర్ ఎస్ ఎస్ గతంలో హిందూ అనే పదాన్ని వాడేదని కానీ నేడు సనాతన లేక మను ధర్మం అంటున్నారని అంటే వారికి హిందూ అనే పదం కూడా వాడరని ఎందుకంటే వారికి ఆ పదం పైన కూడా అభ్యంతరం మే అని అన్నారు. ఇది తెలియకుండా కింది వర్గాల వారైన బహుజనులు, దళితులు, అగ్రవర్ణాలైన రెడ్డి,కమ్మ, కాపు, వెలమ కులాల ప్రజలు కూడా వారికి మద్దతు పలుకుతున్నారని కానీ నిజం తెలియడం కొద్ది రోజుల్లోనే తెలుసుకొని వారిని గద్దె దింపుతారని అన్నారు. స్వాతంత్ర్యం అంటే ఒక పరిపాలకులు పోయి మన పరిపాలకులు రావడమని మరి నేడు మోహన్ భగవత్ రాముడిని ప్రతిష్ఠించాకే స్వాతంత్ర్యం వచ్చిందని పలకడం స్వాతంత్ర్యం కోసం అమరులైన భగత్ సింగ్,చంద్రశేఖర్, సుభాష్ చంద్ర బోస్,ఝాన్సీ లక్ష్మీబాయి శివాజీ మహారాజ్ లాంటి లక్షలాది త్యాగాలను తక్కువ చెయ్యడేమేనని అన్నారు.ఆర్ ఎస్ వైస్ స్వాతంత్ర్యం పూర్వమే ఆవిర్భావించినప్పటికీ వారు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనకుండా,బ్రిటిష్ వారు ఇచ్చే ఉద్యోగాలు తీసుకొని బ్రిటిష్ వారికి మద్దతు ఇచ్చిన చరిత్ర తప్ప వారికి స్వాతంత్ర్య సమరయోధులు లేరు ,ఇది ప్రజలకు తెలిసి చైతన్యవంతులైతే తమ మనుగడకు ప్రమాదమని గ్రహించి చిత్పన్న బ్రాహ్మణులు చేస్తున్న కుట్ర కాబట్టి బ్రాహ్మణ కుట్రలను ప్రజలు తెలుసుకోవాలని అన్నారు.మరోసారి స్వాతంత్ర్యం పై వక్రీకరించి మాట్లాడకుండా చెయ్యాలంటే మోహన్ భగవత్ ను వెంటనే అరెస్టు చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు హరినాథ్, సహాయ కార్యదర్శి దుర్గయ్య, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు రాములు, శాఖ కార్యదర్శులు మహాదేవ రెడ్డి,వెంకటేష్, నాయకులు ఇమామ్, సోమన్న సామెల్,బాబు, అయోధ్య, యాదగిరి, ఆశప్ప, జంబూ లు తదితరులు పాల్గొన్నారు.




## మూడో సారి యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గా నీలం పద్మ వెంకట్ స్వామి



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి జనవరి 17:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణానికి చెందిన నీలం పద్మ వెంకట్ స్వామి యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మూడోసారి ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీత రావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బీర్ల ఫౌండేషన్ చైర్మన్ అనిత ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటికే ఆమె రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇంచార్జి కో ఆర్డినేటర్ గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ మహిళా కాంగ్రెస్ సభ్యత్వాలను చేసి ముందంజలో ఉన్నామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించే దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ లను ప్రజలలోకి తీసుకుపోయి ప్రభుత్వ పథకాలను డోర్ టు డోర్ చేరవేయాల్సిన బాధ్యత మహిళా కాంగ్రెస్ పైన ఉందని చెప్పారు. రాబోయే రోజుల్లో మహిళలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# గీత కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పోరాటం

...సర్వాయి పాపన్న మోకు దెబ్బ జిల్లా సంఘం



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి జనవరి 17:** గీత కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ సంఘం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని ఆ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు దూడల రమేష్ గౌడ్ ప్రధాన కార్యదర్శి బైరి విశ్వనాథం గౌడ్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ఆ సంఘం సాధారణ సమావేశంలో మాట్లాడుతూ గీత కార్మికులకు ప్రభుత్వం తక్షణమే సేఫ్టీ మోకు లను అందించాలని అదే విధంగా వృత్తి నిర్వహణలో భాగంగా ప్రమాదవశాత్తు మృతి చెందిన వారికి ఎక్స్ గ్రే షియా తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన గీతా కార్మికులకు అందరికీ పెన్షన్ సౌకర్యం కల్పిస్తూ ప్రతి గీత కార్మికుడికి ఉపాధి భద్రత కల్పించాలని గీతా కార్మికులకు ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. గీత కార్మికుల సంక్షేమం కోసం సమస్యల పరిష్కారం కోసం తాము నిరంతరం పోరాట నిర్వహిస్తామని ప్రకటించారు. గీత కార్మికులంతా ఐక్యంగా ఏకతాటిపైకి రావాలని హక్కుల సాధనకై సమస్యలు పరిష్కరించుకునేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న మోకు దెబ్బ జిల్లా సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఫిబ్రవరిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఫిబ్రవరిలో మండల జిల్లా కమిటీల నూతన బాధ్యులచే ప్రమాణ స్వీకారం చేయించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు చెప్పారు. ఫిబ్రవరి మాసంలో యాదగిరిగుట్టలో పెద్ద ఎత్తున తలపెట్టనున్న సంఘం సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులతో పాటు రాష్ట్ర జిల్లా నాయకులు పెద్ద ఎత్తున హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోకు దెబ్బ ఆలేరు మండల అధ్యక్షుడు పోతుగంటి సంపత్ కుమార్ గౌడ్ సంఘం సీనియర్ నాయకులు మచ్చ నరసింహ గౌడ్ తోట సత్యం గౌడ్ లక్ష్మణ్ గౌడ్ వెంకటేష్ గౌడ్ హనుమంత్ గౌడ్ లక్ష్మణ్ గౌడ్ యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులను తెలియజేస్తు క్యాలెండర్ లను పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు



**షణ్ముఖ వెలుగు శ్రీరంగాపురం ప్రతినిధి జనవరి 17:** శ్రీరంగాపురం మండల పరిధిలోని కంబాళాపురం, నాగరాల గ్రామాల్లో నూతన సంవత్సర క్యాలెండర్ లను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరిరాజు మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి పాల్గొని ఎమ్మెల్యే మేఘారెడ్డిని గెలిపించుకుని సంవత్సరం కాలం పూర్తయిన సందర్భంగా నియోజకవర్గంలో చేసిన పలు అభివృద్ధి పనులను తెలియజేస్తూ ప్రతి ఇంటికి క్యాలెండర్ లను పంపిణీ చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి,మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కురుమన్న, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆశన్న,మండల కాంగ్రెస్ నాయకులు సయ్యద్ వాయిద్దీన్,వెంకటయ్య,శివన్న,వెంకటేష్ నాయక్,శంకర్ యాదవ్,చందు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ చిత్తారమ్మ దేవి జాతర స్వర్ణోత్సవాలలో శ్రీ మహా గణపతి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి జనవరి 17:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజుల రామారంలో శ్రీ శ్రీ చిత్తారమ్మ దేవి జాతర స్వర్ణోత్సవాలలో భాగంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూన శ్రీశైలం గౌడ్, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి చిత్తారమ్మ గుడిలో మహా గణపతి పూజలో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు అంతయ్య గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు బాలరాజు, నరసింహ, జి నరసింహ, ఇంద్రసేన గుప్తా, సత్తయ్య, శంకర్ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి,పెంటారెడ్డి, బుచ్చిరెడ్డి , గౌరిశెట్టి శివ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ సహాయంతో టిబి శాంపిల్స్ సేకరణ



**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు మండల ప్రతినిధి జనవరి 17:** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డ గూడూరు మండలం గట్టు సింగారం గ్రామంలో శుక్రవారం టీబీ లక్షణాలు వున్నా వ్యక్తుల నుండి శాంపిల్స్ తీసి డ్రోన్ ద్వారా రామన్నపేట ఏరియా ఆసుపత్రికి పంపి అక్కడి నుండి బీబీనగర్ ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా అడ్డ గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ భరత్ రాథోడ్ మాట్లాడుతూ ఈ డ్రోన్ సేవల ద్వారా ప్రతి ఒక్క మారు మూల గ్రామాలకు వెళ్లి అక్కడ టీ బి లక్షణాలు కలిగిన వారి నుంచి శాంపిల్స్ తీసి త్వరగా ఆస్పత్రులకు పంపించడం వల్ల వారికి టిబి లక్షణాలు ఉన్నట్లయితే పేదవారికి మెరుగైన వైద్యంతో పాటు తక్కువ సమయంలో టీబి లక్షణాలున్న వారికి మందులు అందించడం ఈ డ్రోన్ చాలా ఉపయోగపడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ శారద,సూపర్వైజర్ సరోజన ఎం ఎల్ హెచ్ పి మౌనిక, ఎఎన్ఎం విజయ. ఎయిమ్స్ సిబ్బంది విద్యా సాగర్ నందకిశోర్ డ్రోన్ పైలెట్ లు ఆశ కార్యకర్తలు దుర్గమ్మ,మదనమ్మ, ఎస్టిఎల్ఎస్ జానకి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహాకారంతో పోరుమల్ల గ్రామానికి నూతన సబ్ స్టేషన్ మంజూరు





**షణ్ముఖ వెలుగు మేడిపల్లి మండలం ప్రతినిధి జనవరి 17:** జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గ మేడిపల్లి మండలంలోని పోరుమల్ల గ్రామానికి 2 కోట్ల 55 లక్షల 65 వేల రూపాయలతో 33/11 కేవి నూతన సబ్ స్టేషన్ ను మంజూరు చేస్తూ సీఎం డీ కే వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పోరుమల్ల ప్రజలు,రైతులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న నూతన సబ్ స్టేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృషి తో మంజూరు కావడం జరిగిందని నూతన సబ్ స్టేషన్ మంజూరు కావడం పట్ల రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు... నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడం వల్ల రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు అందజేయడం జరుగుతుంది.. కాగా సబ్ స్టేషన్ మంజూరి కి కృషిచేసిన ప్రభుత్వ విప్ కు మేడిపల్లి మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజల ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు

## నాయి బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్ కొరకు మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేత




**షణ్ముఖ వెలుగు పెబ్బేరు ప్రతినిధి జనవరి 17:** పెబ్బేరు నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు నారాయణదాసు బాలకృష్ణ గౌరవ అధ్యక్షులు సదుర్ల శంకర్ ప్రధాన కార్యదర్శి సదుర్ల సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ కు కమ్యూనిటీ హాల్ కొరకు స్థలం మరియు హాల్ నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవ సంఘం మండల అధ్యక్షులు నారాయణదాసు బాలకృష్ణ,గౌరవ అధ్యక్షులు సదుర్ల శంకర్, ప్రధాన కార్యదర్శి సదుర్ల సురేష్ నారాయణదాసు చంద్రశేఖర్, సదుర్ల శాంతన్న, ఆరేపల్లి రాజేష్, దొడ్ల వరదరాజు, నారాయణదాసు ఆంజనేయులు, అజ్జకొల్లు కృష్ణ, నారాయణదాసు రవి, ఏముగడ్డ పరమేష్,సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా హ్యాండ్ బాల్ జట్టు కోచ్ గా ఉమా శంకర్



**షణ్ముఖ వెలుగు పెబ్బేరు ప్రతినిధి జనవరి 17:** ఈ నెల 18 నుండి 21 వరకు కరీంనగర్ జిల్లాలోని అంబేద్కర్ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా హ్యాండ్ బాల్ జట్టుకు ఉమా శంకర్ కోచ్ గా ఎంపికయ్యారని సంయుక్త మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ తకియుద్దీన్ మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్ తెలియజేశారు.


## గత ప్రభుత్వం లో సాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు

కృష్ణా జలాలకు పూజ చేసిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి




**షణ్ముఖ వెలుగు పెబ్బేరు ప్రతినిధి జనవరి 17 :**ఖిల్లా ఘణపురం మండలం మల్కాపురం గ్రామానికి చేరుకున్న కృష్ణమ్మ జలాలకు శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పూజలు చేశారు. సాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారమని గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు నాయకులకు అధికారులకు విన్నవించుకున్నా గ్రామానికి అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టలేదని నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కృష్ణ నీటిని గ్రామానికి మళ్ళించారని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో నీరొచ్చిన పొలాలపై పడి రైతు పొలాలకు అందేది కాదని నేడు డి 8 కాలువ నుంచి నేరుగా గ్రామానికి నీరందడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి,మాజీ జడ్పిటిసి సభ్యులు సోలి పురం రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటయ్య, వెంకట్రావు నాయకులు సాయి చరణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ సతీష్, ప్రకాష్ కొండా రెడ్డి,మండల నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు

## మొట్ట మొదటి జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి ని సన్మానించిన కోరుట్ల బిజెపి పట్టణ శాఖ



**షణ్ముఖ వెలుగు కోరుట్ల టౌన్ ప్రతినిధి జనవరి 17:** జగిత్యాల జిల్లా కోరుట్ల బిజెపి పట్టణ శాఖ నాయకులు శుక్రవారం రోజున జాతీయ పసుపు బోర్డు మొదటి చైర్ పర్సన్ గా నియమితులైన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు .అనంతరం వారు మాట్లాడుతూ పల్లె గంగారెడ్డి భారతీయ జనతా పార్టీకి చేసిన సేవలు గుర్తు చేస్తూ కొనియాడారు. ఇట్టి కార్యక్రమంలో బీజేపీ కోరుట్ల పట్టణ అధ్యక్షులు బింగి వెంకటేష్, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఇట్యాల నవీన్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు సుదవేని మహేష్, పట్టణ మాజీ అధ్యక్షులు చిరుమల్ల ధనుంజయ కోరుట్ల పట్టణ బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్ విజేత ఇటిక్యాల



**షణ్ముఖ వెలుగు మల్లాపూర్ ప్రతినిధి జనవరి 17:** మల్లాపూర్ మండలంలోని వి వి రావు పేట గ్రామంలో రాయికల్, మల్లాపూర్ మండల స్థాయి టోర్నమెంట్ లో స్థానిక ప్రైమరీ స్కూల్ గ్రౌండ్ లో నర్సింగం స్పోర్ట్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు మండలాల స్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీలు నిర్వహించారు .ఈ పోటీల్లో ఇటిక్యాల జట్టు మొదటి స్థానంలో గెలుపొందగా రెండో స్థానంలో మల్లాపూర్ టీం లు గెలిచుకున్నాయి గెలిచిన క్రీడాకారులకు నగదు తో పాటు బహుమతులు అందజేశారు . ఈ కార్యక్రమంలో క్రీడాకారులు క్రీడాభిమానులు వివిధ గ్రామాలకు చెందిన యువకులు, స్థానిక నాయకులు పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు, నిబంధనలకు

# విరుద్ధమైన అబార్షన్ లను చేస్తే కఠిన చర్యలు తప్పవు

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి..







**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ రూరల్ ప్రతినిధి జనవరి 17:** మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని సింగాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై మాట్లాడుతూ ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు, నిబంధనలకు విరుద్ధమైన అబార్షన్ లను చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని అంగన్వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో పూర్వ ప్రాథమిక విద్యను బోధిస్తున్నామని.. చిన్నారులను కేంద్రాలకు పంపించాలని తల్లులకు సూచించారు. మనకు ఆరోగ్యం కంటే ఏది ఎక్కువ కాదని.. తమతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని మహిళలకు సూచించారు. గర్భిణీగా నిర్ధారణ అయినప్పటి నుంచి తీసుకున్న పౌష్టికాహారంతో పుట్టిన చిన్నారుల్లో సరైన మానసిక, శారీరక ఎదుగుదల ఉంటుందన్నారు. గర్భిణీ విధిగా నాలుగు ఏఎంసీ చెకప్ లు, ఐదు నెలలు దాటిన తర్వాత టిఫా స్కాన్ చేయించుకోవాలన్నారు.చెల్పూర్ సెక్టార్ పరిధిలో కొంత మంది చిన్నారులు పోషకాహార లోపంతో ఉన్నారని, వారి ఎత్తు, బరువు వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని ఐసిడిఎస్, ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే ఆహారం ఇళ్లకు తీసుకెళ్లకుండా అక్కడే తినాలని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. పిల్లలకు షుగర్ ఉన్న ప్రాసెస్డ్ ఫుడ్ పెట్టి.. వారిని బలహీనంగా మార్చవద్దని అన్నారు.శుక్రవారం సభకు మహిళలు వస్తే అన్ని విషయాలపై అవగాహన కలుగుతుందన్నారు.ఆరోగ్య మహిళ కింద రూ. 40 వేల విలువైన 54 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందిస్తున్నామని.. మహిళలు విధిగా ఆరు నెలలకోసారి సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. జిల్లా సంక్షేమ అధికారి సబిత మాట్లాడుతూ ఇంద్రధనస్సులో ఏడు రంగుల మాదిరి మన ప్లేట్లో ఏడు రకాల ఆహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు.ఈ సందర్భంగా పోషకాహార పదార్థాలు ప్రదర్శించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కలెక్టర్,డీడబ్ల్యూఓ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, డీఎంహెచ్ఓ వెంకటరమణ, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో సునీత తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థికి లాప్ టాప్

# బహుకరించిన దొంతి అవియుక్త్ రెడ్డి





**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి జనవరి 17:** పేదరికం విద్యార్థి చదువుకు ఆటంకం కలుగ కూడదని సివిల్ ఇంజనీరింగ్ చదువుతున్న పేద విద్యార్థికి ఎమ్మెల్యే కుమారుడు దొంతి అవియుక్త్ రెడ్డి 60 వేల విలువ చేసే లాప్ టాప్ ను అందించారు. నర్సంపేట నియోజకవర్గం లోని చెన్నారావుపేట మండలం బాపు నగర్ గ్రామానికి చెందిన మంతెన ప్రభుదాస్ కుమారుడు మంతెన సన్నీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తాడేపల్లిగూడెం నేషనల్ ఇన్ స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీలో సివిల్ ఇంజినీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. సన్నీ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున చదువుకోడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తన కుమారుడు యువ నాయకుడు దొంతి అవియుక్త్ రెడ్డి సహకారంతో ఏసర్ కంపెనీకి చెందిన 55,990 రూపాయల విలువ గల లాప్ టాప్ ను పేద విద్యార్థి మంతెన సన్నీకి బహుకరించారు. మంతెన సన్నీ దొంతి అవియుక్త్ రెడ్డి కి రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు.

**అంగవైకల్యం గల పీజీ విద్యార్థికి ఆర్థిక సహాయం**

నర్సంపేట పట్టణానికి చెందిన రాజేందర్ అనే వికలాంగ యువకుడు యూనివర్సిటీ కళాశాలలో పీజీ విద్యాభ్యాసం చేస్తూ ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాడు. వికలాంగుడు రాజేందర్ నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ని కలిసి తన గోడును వెళ్ళబోసుకోగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గ తన కుమారుడు దొంతి అవియుక్త్ రెడ్డి చే రూ.12 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

## అభివృద్ధిపై మాట్లాడే హక్కు బిఆర్ఎస్

# పార్టీకి లేదు - పీసీసీ సభ్యులు పెండెం రామానంద్



**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి జనవరి 17:** అభివృద్ధిపై మాట్లాడే విమర్శించే హక్కు బిఆర్ఎస్ పార్టీ నాయకులకు లేదని టి పీసీసీ సభ్యులు పెండెం రామానంద్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పీసీసీ సభ్యులు పెండెం రామానంద్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని అభివృద్ధి నిధుల పై మాట్లాడే అర్హత ఇప్పుడు లేదన్నారు. ఐదు సంవత్సరాలు ప్రజలు నిన్ను ఆదరిస్తే కోట్ల రూపాయల నిధులు తెచ్చి అభివృద్ధి చేసినా అని చెబుతున్న నువ్వు అభివృద్ధి ఎక్కడిది అక్కడే అస్తవ్యస్తంగానే వదిలిపెట్టి పోయావన్నారు. రోడ్లుగాని కమిటీ హాల్ గాని మోడల్ మార్కెట్ గాని నాన్ వెజ్ మార్కెట్ గాని పాకాల ఆడిటోరియం గాని మధ్యలో వదిలేసి ప్రజల ధనాన్ని నిధులను దుర్వినియోగం చేసి వెళ్లిన చరిత్ర నీది కాదా అని ప్రశ్నించారు. నర్సంపేట శాసన సభ్యులు దొంతి మాధవరెడ్డి వాటన్నిటిని కూడా నిక్కచ్చిగా పూర్తి చేయడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారని అభివృద్ధి నిధులు మేమే తెచ్చామని ప్రగల్భాలు పలకవలసిన అవసరం లేదన్నారు. ఎవ్వరు అధికారంలో ఉంటే వారికి నిధులు మంజూరు కావడం జరుగుతుందని వారే అభివృద్ధి చేయడం జరుగుతుంది, కానీ మాజీ ఎమ్మెల్యే నిధులతోనే ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అభివృద్ధి చేస్తున్నారని చోటా మోటా నాయకులు పత్రిక సమావేశాలు పెట్టి విమర్శించే అర్హత వాళ్లకు లేదని విమర్శించారు. రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసమే ఈ విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే దొంతిని విమర్శించే నైతిక హక్కు అర్హత పత్రిక సమావేశాలు పెట్టే నాయకులకు లేదన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అండదండలతో అధికారికంగా ఎదిగి స్వార్థం రాజకీయల కోసం పార్టీలు మారిన మీరు ఎమ్మెల్యే దొంతిని విమర్శించే హక్కు ఉందా అని ప్రశ్నించారు. మీరు భగీరథ పేరుతో ధ్వంసం చేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో రూపాయలు 40 కోట్లతో పట్టణంలో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లను పూర్తి స్థాయిలో పూర్తి చేస్తున్నామని అన్నారు. ఇకపై పత్రిక సమావేశాలు పెట్టి నైతిక విలువలు మర్చిపోయి మాట్లాడే చోటా మోటా నాయకుల పద్ధతిని మార్చుకోకపోతే ప్రజా క్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

## మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకై బండబావి స్థలాన్ని సందర్శించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**షణ్ముఖ వెలుగు కాప్రా సర్కిల్ ప్రతినిధి జనవరి 17:** ఉప్పల్ నియోజకవర్గం మీర్ పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ ఓల్డ్ మీర్ పేట్ ఎన్టీఆర్ నగర్ లో మున్సిపల్ అధికారులతో కలిసి మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు విషయమై బండ బావి స్థలాన్ని సందర్శించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇంత విశాలమైన స్థలం ఉందని, ఈ స్థలం అభివృద్ధి దృష్ట్యా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రభుదాస్ గతంలో రోనాల్డ్ రాస్ బృందం సందర్శించిందని గుర్తు చేశారు. మల్లాపూర్ బండ బావి ప్రాంతంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ విషయంలో సహకారం అందించాలని కోరారు. మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కు సంబందించిన లెటర్స్ అన్ని జోనల్ కమిషనర్ కు ఎస్ఈ కి అందించామని ఈ విషయంలో సహకారం అందిస్తే స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, ప్రాజెక్ట్స్ నుండి డీఈ రవీందర్, డీఈ ఉమా మహేశ్వరి, మెయింటెనెన్స్ నుండి డీఈ రూప, ఏఈ లింగా రావు, ఏఈ భారత్, వర్క్ ఇన్ స్పెక్టర్ చారి మరియు స్థానిక నాయకులు కటార్ల భాస్కర్, నరసింహ గౌడ్, భానురి రాకేష్, వేణు గౌడ్, శ్రీనివాస్ యాదవ్, వెంకటచారి, రామకృష్ణ, వాసు చారి, రంగు ప్రసాద్, రాజు, శ్రీనివాస్, శ్యామ్, విజయ్, అంజి, నిసార్ అహ్మద్ గోరి, సంజయ్, కృష్ణ, ప్రవీణ్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు

## పోలీసులు ప్రజలకు అందుబాటులో

# ఉండి సేవలు అందించాలి- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్






**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట మండల ప్రతినిధి జనవరి 17** ఎల్లారెడ్డి పేటలో పోలీస్ స్టేషన్ లో ఆకస్మికంగా తనిఖీలు చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీసులు ప్రజలకు అందుబాటులో వుండి సేవలు అందించి మంచి పేరును తెచ్చుకోవాలని జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎల్లారెడ్డి పేట పోలీస్ స్టేషన్ ను ఎస్పి ఆకస్మిక తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలను, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివరాలు ,స్టేషన్ రికార్డ్ లు తనిఖీ స్టేషన్ లో నమోదు అయిన వివరాలు పరిశీలించిన ఎస్పీ కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించరాదని,ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ సేవలందించాలని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించి పోలీసులు అంటే మంచి పేరు వచ్చేలా పని చేయాలని ఎస్పి సూచించారు. బ్లూ కోర్ట్ ,పెట్రో కార్ సిబ్బంది 100 డయల్ కాల్స్ కి తక్షణమే స్పంచింది సంఘటనా స్థలానికి చేరుకోవాలని తెలిపారు. సంఘటన స్థలంలో ఏర్పడ్డ సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్ లను ప్రతి రోజు తనిఖీ చేయాలని,స్టేషన్ పరిధిలో సీసీ టీవీలు ఏర్పాటుపై దృష్టి సారించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని స్టేషన్ పోలీస్ అధికారులను ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా అధికారులు,విలేజ్ పోలీస్ అధికారులు తరచు గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతు పని చేయాలని, ప్రజలకు చట్టాల పై అవగాహన కల్పించిడయల్100,షీ టీమ్స్, సైబర్ నేరాలు,ట్రాఫిక్ నియమాలు తదితర అంశాల వివరాలను వివరించాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు సిబ్బంది, కృషి చేయాలని తెలిపారు. స్టేషన్ లోని సిబ్బంది,పోలీస్ అధికారులు విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని ఎస్పి అఖిల్ మహాజన్ తెలిపారు. పోలీసుల పనితీరు పట్ల ప్రజల అభిప్రాయాలను సేకరించడం కొరకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ప్రారంభించిన క్యూ ఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ ని జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేయడం జరిగిందని ఆన్నారు. పోలీస్ స్టేషన్ లలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ని స్కాన్ చేసి పిటిషన్, ఎఫ్ఐఆర్, ఇ-చలాన్ మరియు పాస్‌పోర్ట్ ధృవీకరణ, బాధితులు పోలీస్ స్టేషన్ కి వెళ్ళినప్పుడు పోలీసు అధికారుల, సిబ్బంది ప్రతిస్పందన మరియు వారి ప్రవర్తనపై ప్రజలు,బాదితులు తెలియచేసి క్యు ఆర్ కోడ్ ను సద్వినియోగం చేసుకోని పోలీస్ సేవలపై సలహాలు సూచనలు ఇవ్వాలని ఎస్ పి అఖిల్ మహాజన్ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సి.ఐ శ్రీనివాస్, ఎస్సై రమాకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## పసుపు బోర్డు ఎర్పాటు పై మోది అమిత్ షా, కిషన్ రెడ్డి

# బండి సంజయ్, ధర్మపురి అరవింద్ ల చిత్ర పటాలకు పాలాభిషేకం

**షణ్ముఖ వెలుగు ఇబ్రహీం పట్నం మండలం ప్రతినిధి జనవరి 17:** దాదాపు 40 సంవత్సరాలుగా పసుపు బోర్డు ఏర్పాటు కోసం చేస్తున్న సుదీర్ఘ పోరాటంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో బిజెపి నాయకులు నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ కృషితో పసుపు బోర్డును నిజామాబాద్ లో మకర సంక్రాంతి సందర్భంగా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఏర్పాటు జరిగడం పై అభినందిస్తు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేముల కుర్తి గ్రామంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో రైతులు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో చత్రపతి శివాజీ విగ్రహం ముందు ప్రధానమంత్రి మోది ,కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా, మంత్రులు కిషన్ రెడ్డి ,కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ చిత్ర పటాలను ఎర్పాటు చేసి పాలాభిషేకం చేసి పసుపు రైతులు నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఇచ్చిన మాట ప్రకారం పసుపు బోర్డు ఏర్పాటు చేసిందని,అదే తరహాలో కోరుట్ల నియోజక వర్గం లోని ముత్యం పెట్ లోని నిజాం షుగర్ ఫ్యాక్టరీ ని ప్రారంభిస్తే రైతులకు మరింత మేలు జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కోటగిరి ప్రభాకర్, ఎడి పెళ్ళి భుమన్న, పోతరాజు పెద్ద రాజం, దోనికెన రాజేష్,బెల్లాల రాజం రాధారపు దేవదాస్,మాలేపు శ్రీనివాస్, కోటగిరి




వెంకటస్వామి, అరె రమేష్ చంద్ర రెడ్డి, గుజ్జె గంగాధర్, దోనికెన మహేందర్,అరె రమేష్, రాపర్తి దేవేందర్, అరె మల్లయ్య,దోనికెన ప్రశాంత్ తరి గంగారాం, మాలేపు భూమయ్య , కటుకం నారయణ, పట్నం నర్సయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలు పేరిట తెలంగాణ ప్రభుత్వం కాల యాపన చేస్తుంది

బిజెపి మండల అధ్యక్షులు బాయి లింగారెడ్డి



**షణ్ముఖ వెలుగు ఇబ్రహీం పట్నం మండలం ప్రతినిధి జనవరి 17:** సంక్షేమ పథకాలు అమలు పేరిట ప్రభుత్వం కాలయాపన చేస్తుందని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి అన్నారు. శు క్రవారం అయన విలేఖరులతో మాట్లాడుతు తెలంగాణ రాష్టం లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎర్పడి సంవత్సరం గడుస్తున్నా రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లతో పాటు కొత్త రేషన్ కార్డు లు తదితర సంక్షేమ పథకాలు అమలు చేయటం లో విఫలమైందని, కాలయపచేసి రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ఇప్పుడు కొత్తగా సర్వే పేరుతో రేషన్ కార్డుల మీద నిబంధనలు పెట్టడమేమిటని, గత 11 సంవత్సరాల నుండి రేషన్ కార్డు గత ప్రభుత్వం ఇవ్వకుండా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడ గత ప్రభుత్వం లో దరఖాస్తు చేసుకున్న వారికే ఇస్తాం అనడం విడ్డూరంగా ఉందని ,కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఇంటికి కొత్తగా రేషన్ కార్డు ఇవ్వాలని ,ఏ నిబంధనలు పెట్టినా ప్రజల పక్షాన ఉద్యమం చేస్తామని, ఇబ్రహీంపట్నం మండలం లో జరుగుతున్న ఇంటింటి సర్వే లో రేషన్ కార్డు కొరకు దరఖాస్తులు తీసుకోవాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## స్కిల్ వర్సిటీతో బోణి

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. నైపుణ్యాల అభివృద్ధి (స్కిల్ డెవెలప్మెంట్) శిక్షణలో భాగస్వామ్యం కోసం పరస్పర సహకారం అందించాలని కోరారు. దీనిపై ఐటీఈ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో కలిసి పని చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. చర్చల అనంతరం నైపుణ్యాల అభివృద్ధిలో కలిసి పని చేసేందుకు ఐటీఈ, స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంపై యూనివర్సిటీ వీసీ సుబ్బారావు, సింగపూర్ ఐటీఈ ప్రతినిధి బృందం తరపున అకడిమిక్ అండ్ అడ్మిన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ పర్వేందర్ సింగ్, ఐటీ ఎడ్యుకేషన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ సంతకాలు చేశారు. త్వరలోనే ఐటీఈ ప్రతినిధి బృందం హైదరాబాద్‌ను సందర్శించనుంది.

**సింగపూర్ మంత్రితో...**

కాగా.. ఈరోజు ఉదయం సింగపూర్ విదేశాంగ మంత్రి వీవీఎన్ బాలకృష్ణతో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. గ్రీన్ ఎనర్జీ, మూసీ పునరుజ్జీవనం, పర్యాటకం, విద్య, ఐటీ, నైపుణ్య నిర్మాణంపై వారు చర్చించారు. సీఎంతో పాటు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్ భేటీలో పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత.. వాటి విలువ ఎంతంటే..

**హైదరాబాద్:** నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 190 గ్రాముల హెరాయిన్, ద్విచక్రవాహనం, మొబైల్స్ సహా ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ. 23 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మీడియాకు రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు వివరాలు తెలిపారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన మహేష్, మహిపాల్‌గా గుర్తించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో అధిక ధరలకు నిందితులు హెరాయిన్ విక్రయిస్తున్నారని అన్నారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన వారైనా నేరేడ్‌మెట్ పరిధిలో స్థిరపడ్డారని అన్నారు. వినియోగదారులకు డ్రగ్స్ చేరవేయడంలో వివిధ పద్ధతులు వాడుతున్నారన్నారు. నిందితులు గ్యాస్ సిలిండర్ రిపేర్లు చేసే వారిగా పనిచేస్తున్నారని తెలిపారు. గ్యాస్ రిపేర్‌కు సంబంధించిన పరికరాల్లో ప్యాక్ చేసి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని అన్నారు. గ్యాస్ సిలిండర్ వాల్వ్‌లలో ప్యాక్ చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. అనుమానం రాకుండా ఇలాంటి టెక్నిక్స్ వాడుతున్నారని చెప్పారు. ఓలా, ఊబర్, రాపిడో సహా ఇతర మార్గాల ద్వారా వీటిని కస్టమర్లకు చేరవేస్తున్నారన్నారు. 200 గ్రాముల హెరాయిన్ లక్ష రూపాయలకు కొనుగోలు చేసి... దానిని దాదాపు రూ. 23 నుంచి 25 లక్షల వరకు విక్రయిస్తున్నారన్నారు. రాజస్థాన్‌కు చెందిన శంషుద్దీన్ అనే డ్రగ్ పెడ్లర్ నుంచి నిందితులు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. 2024 నుంచి ఇప్పటి వరకు రాచకొండ పరిదిలో దాదాపు రూ. 88 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేశామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని చెప్పారు. పిల్లలు, యువత ఇలాంటి మత్తు పదార్థాలకు బలికావద్దంటే... ప్రజల సహకారం కూడా కావాలని చెప్పారు. డ్రగ్స్ సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని అన్నారు.

## నూతన రేషన్ కార్డుల సర్వేను పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్ తిరుపతి




**షణ్ముఖ వెలుగు కోరుట్ల టౌన్ ప్రతినిధి జనవరి 17:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో శు క్రవారం రోజున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రవేశ పెట్టిన నూతన రేషన్ కార్డుల సర్వేను నిర్వహించ వలసిందిగా ఆదేశాలు జారీచేశారు జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్, ఆదేశాల మేరకు పట్టణములో అన్ని వార్డుల్లో నిర్వహిస్తున్న నూతన రేషన్ కార్డుల సర్వేను కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి పలు వార్డుల్లో పర్యవేక్షించారు, అనంతరం ప్రభుత్వ గురుకులంలో 5 వ తరగతి నుండి 9 వ తరగతి వరకు విద్యార్థుల ప్రవేశాలకై ప్రభుత్వ వాల్ పోస్టర్ విడుదల చేశారు ఇట్టి అవకాశాన్ని విద్యార్థి, విద్యార్థినులు అందరూ వినియోగించు కోవాలని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి సూచించారు.

## రేషన్ కార్డ్ సర్వేలో పాల్గొన్న జువ్వాడి కృష్ణారావు



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి క్రైమ్ ప్రతినిధి జనవరి 17:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అమలు చేయబోతున్న రేషన్ కార్డుల పంపిణీ కోసం నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా శుక్రవారం కోరుట్ల నియోజకవర్గ మెట్ పల్లి పట్టణంలో నిర్వహించిన సర్వేలో మెట్ పల్లి ఆర్డీవో శ్రీనివాస్ తో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు 17 వ వార్డులో పర్యటించారు .ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టో లో ప్రకటించిన ఆరు గ్యారంటీ ల్లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందిస్తుందని అందులో భాగంగానే ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో తో పాటు మెట్ పల్లి మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్ ఎంపీడీవో మున్సిపల్ కమిషనర్ ఏఓ ఏఈ ఇతర అధికారులతో పాటు మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెట్టి లింగం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజిరెడ్డి పూదరి నర్సాగౌడ్ తుమ్మనపల్లి రాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నరసింహా స్వామిని దర్శించుకున్న జువ్వాడి కృష్ణారావు



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి క్రైమ్ ప్రతినిధి జనవరి 17:**మెట్ పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామంలో పురాతన శ్రీ ప్రహ్లాద సహిత లక్ష్మీనరసింహస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు .ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు శుక్రవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అర్చకులు జువ్వాడి కృష్ణారావుకు వేద ఆశీర్వచనం అందజేసి తీర్థ ప్రసాద వితరణ చేశారు . ఈ కార్యక్రమంలో మెట్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిపి రెడ్డి అంజిరెడ్డి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెట్టి లింగం మాజీ ఎంపీపీ తోగిటి అంజయ్య రాజేష్ మోతే గణేష్ నారాయణరెడ్డి వెంకట్ రెడ్డి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యోగ్యం కాని భూములు గుర్తించాలి

అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్.

రెండు మండలాల్లో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.



**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట మండల ప్రతినిధి జనవరి 17:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా పథకానికి అర్హులను గుర్తించాలని, వ్యవసాయ యోగ్యం కాని భూములు గుర్తించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. ఎల్లారెడ్డి పేట మండలం సింగారం, ముస్తాబాద్ మండలం మద్ది కుంట లో రైతు భరోసా కోసం సర్వే శుక్రవారం కొనసాగుతుండగా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ పథకాల అమలు కోసం కొనసాగుతున్న సర్వే పై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే పకడ్బందిగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన వన అధికారి లత, ఎల్లారెడ్డి పేట, ముస్తాబాద్ తహసీల్దార్ లు రామచంద్రం, సురేష్ ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సూపర్‌స్టార్ కోసం గ్లోబల్ స్టార్


మహేశ్‌బాబు రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న ‘ఎస్ఎస్ఎంబీ29’ కోసం ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం సెట్స్ మీదకి ఎప్పుడు వెళ్తుందా అని ఆసక్తిగా ఉన్నారు. ఇటీవల ఈ చిత్రాన్ని సైలెంట్‌గా పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచే రకరకాల ఉహాగానాలు వైరల్ అయ్యాయి. ఏదీ అధికారికంగా ప్రకటించనప్పటికీ ఈ సినిమాకు సంబంధించిన ఏ వార్త అయినా క్షణాల్లో వైరల్‌గా మారుతున్నాయి. ఇప్పుడు మరో వార్త నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. గ్లోబల్‌స్టార్, బాలీవుడ్ బ్యూటీ ప్రియాంకా చోప్రా ఈ సినిమాలో నటించనున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే! తాజాగా ఆమె హైదరాబాద్ చేరుకున్నారు. దీంతో మహేశ్– రాజమౌళి ప్రాజెక్ట్ కోసమే హైదరాబాద్‌కు వచ్చారంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఆమె విమానాశ్రయంలో కనిపించిన వీడియోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. ఈ సినిమా షూటింగ్‌పై త్వరలోనే అధికారిక అప్‌డేట్ వచ్చే అవకాశం ఉందని ఫ్యాన్స్ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. సినిమా టైమింగ్‌లు ఇటీవల ఈ చిత్రం హైదరాబాద్‌లో అల్యూమినియం ఫ్యాక్టరీలో పూజా కార్యక్రమాలతో మొదలైంది. కథా నేపథ్యం మినహా దీనికి సంబంధించి ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి సమాచారాన్ని బయట పెట్టలేదు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో విదేశీ నటులు కనిపించనున్నారు. దుర్గా ఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.





# మూడు రోజుల్లోనే.. సంక్రాంతికి వస్తున్నాం బ్రేక్ ఈవెన్ పూర్తి

అనిల్ రావిపూడి దర్శకత్వంలో టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్ హీరోగా.. ఐశ్వర్యారాజేశ్, మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం సంక్రాంతికి వస్తున్నాం సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం సంక్రాంతి బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. తాజాగా ఈ మూవీ వసూళ్లకు సంబంధించి క్రేజీ వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. గ్రాండ్‌గా ఓపెనింగ్ వసూళ్లతో మొదలైన ఈ చిత్రం రెండు, మూడో రోజు కూడా అదే మేనియాను కొనసాగించింది. సంక్రాంతికి వస్తున్నాం గుంటూరు, సీడెడ్ ప్రాంతాల్లో బ్రేక్ ఈవెన్ మార్క్ పూర్తి చేసుకుందని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఈ వీకెండ్‌కు ఇతర ప్రాంతాల్లో బ్రేక్ ఈవెన్‌ను బీట్ చేయనున్నట్టు ట్రేడ్ సర్కిల్ టాక్. ఈ చిత్రం కేవలం విడుదలైన మూడు రోజుల్లోనే గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్ల మార్క్‌ను అధిగమించి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. రాబోయే రోజుల్లో మరెన్ని రికార్డులు క్రియేట్ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రంలో నరేశ్, పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు. ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా నేపథ్యంలో వచ్చిన ఈ మూవీని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు. ప్రమోషన్స్‌లో భాగంగా ఎంగేంజింగ్‌గా సాగే ఇంటర్వ్యూలు, చార్ట్ బస్టర్ పాటలు, ఇంప్రెసివ్ ప్రోమోలు.. ఇలా ప్రతీ విషయం సినిమా చుట్టూ మంచి బజ్ క్రియేట్ చేయడంలో కీ రోల్ పోషించాయనడంలో ఎలాంటి సందేహం లేదు.




# ఏం గురాయించి చూస్తున్నవ్.. వీరమల్లు మాట వినాలి..

**పవన్ కల్యాణ్ హరిహరవీరమల్లు ఫస్ట్ సింగిల్ వీడియో**

టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ హరిహరవీరమల్లు జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీ రెండు పార్టులుగా రానుండగా.. హరిహరవీరమల్లు పార్ట్ 1 మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఫస్టి సింగిల్ వినాలి.. వీరమల్లు మాట వినాలి ప్రోమో కూడా విడుదల చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా ఫుల్ లిరికల్ వీడియో సాంగ్ లాంచ్ చేశారు. ఏం గుల్పామ్ ఏం గురాయించి చూస్తున్నవ్ భయపెట్టనీకా..? ఓహో చాలా మందిని చూసినాంలే బిడ్డా. హే మునిమాణిక్యం చూసినవా.. గురాయించి చూస్తుండు బేటా.. మన లెక్క తెల్వదు.. వినాలి.. వీరమల్లు మాట చెబితే వినాలి.. అంటూ తెలంగాణ యాసలో పవన్ కల్యాణ్ స్టైల్‌లో సాగుతున్న లిరిక్స్ ఆకట్టుకుంటూ.. అభిమానులను థ్రిల్ చేస్తున్నాయి. పెంచల్ దాస్ రాసిన ఈ పాటను ఎంఎం కీరవాణి కంపోజిషన్‌లో పవన్ కల్యాణ్ పాడాడు. ఈ సాంగ్ సినిమాకే హైలెట్‌గా నిలువనుందనడంలో ఎలాంటి సందేహం లేదు.
పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మేఘ సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏ దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. ఏఎం రత్నం సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. క్లైమాక్స్‌లో వచ్చే రెడ్ డ్రెస్ ఫైట్‌ను 42 రోజులపాటు చిత్రీకరించారని ఇన్‌సైడ్ టాక్. ఇక ఈ చిత్రంలో ఇంట్రో సాంగ్, టైగర్ ఫైట్, మహల్ యాక్షన్ పార్ట్, కుస్తీ ఫైట్ సీన్, చార్మినార్ యాక్షన్ సన్నివేశాలు, ప్రీ ఇంటర్వెల్, ఇంటర్వెల్ భారీ యాక్షన్ సీక్వెన్స్, క్లైమాక్స్ వార్ సీన్ అభిమానులకు గూస్ బంప్స్ తెప్పించబోతున్నాయట.

## ఓటీటీలోకి వచ్చేసిన ‘పాతాల్ లోక్ సీజన్ 2’

కరోనా లాక్‌డౌన్ టైంలో వచ్చి బ్లాక్ బస్టర్ అందుకున్న వెబ్ సిరీస్‌లలో పాతాల్ లోక్ ఒకటి. క్రైమ్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ వెబ్ సిరీస్‌ను స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి భార్య నటి అనుష్కా శర్మ నిర్మించగా.. జైదీప్ అహ్లావత్, అభిషేక్ బెనర్జీ, స్వస్తిక ముఖర్జీ, గుల్ పనాగ్ తదితరులు ఈ సిరీస్‌లో కీలక పాత్రలో నటించారు. హాథీ రామ్ చౌదరిగా పోలీస్ ఇన్‌స్పెక్టర్ పాత్రలో జైదీప్ అహ్లావత్ మంచి మార్కులు సంపాదించాడు. అయితే ఈ వెబ్ సిరీస్‌కి సీక్వెల్ తీసుకువస్తున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. పాతల్ లోక్ సీజన్ 2 అంటూ రాబోతున్న ఈ సిరీస్‌లో కూడా లీడ్ రోల్స్‌లో జైదీప్ అహ్లావత్‌తో పాటు, ఇష్వాక్ సింగ్, తిలోత్తమా షోమ్, గుల్ పనాగ్ నటిస్తున్నారు. ఇప్పటికే సీజన్‌కి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేయగా.. ఫుల్ రెస్పాన్స్ అందుకుంది.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com